సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

- నాంపల్లి నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్ల వారీగా పోలీసు బలగాల కేటాయింపు
- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద కూడా సాయుధ బలగాలతో పహారా


హబీబ్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నాంపల్లి: లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అల్లర్లకు తావు లేకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలు కంపెనీల కేంద్ర బలగాలు నగరానికి చేరుకున్నాయి. మరో రెండు రోజుల్లో మరిన్ని కంపెనీల బలగాలు బందోబస్తు విధుల కోసం రానున్నాయి.

వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు..

పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందు కోసం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌తో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించవచ్చు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఏవైనా హింసాత్మక సంఘటనలు, విద్రోహ సంఘటనలు జరిగినా కంట్రోల్ రూమ్ నుంచి వీక్షించి వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేయవచ్చు. నాంపల్లి నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్ల వారీగా పోలీసు బలగాలను కేటాయించారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. ఓటర్లకు భరోసా కలిస్తూ స్వేచ్ఛగా ఓటు వేయాలని చెప్తున్నారు. కేంద్ర బలగాలు పోలింగ్ రోజునే కాకుండా ముందస్తుగా తనిఖీ కేంద్రాల వద్ద, బందోబస్తు సేవలు అందిస్తున్నాయి. ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద కూడా సాయుధ బలగాలతో పహారా నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద స్థానిక పోలీసులు, హెడ్‌కానిస్టేబుల్స్‌తో పాటు కేంద్ర బలగాలు బందోబస్తును నిర్వహిస్తారు. సాధారణ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల నుంచి ఒకరు లేదా ఇద్దరితో పాటు స్థానిక పోలీసులు ఉంటారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలుగకుండా బందోబస్తు ప్రణాళిక రూపొందించాం. ప్రజలు ధైర్యంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలి. నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 27 సమస్యాత్మక కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు, పోలింగ్ శాతం పెరగడానికి ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేస్తున్నాం. ఎన్నికలు ముగిసి ఈవీఎంలను భద్రపరిచే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహిస్తారు.
– బి.కిషన్‌కుమార్, ఏసీపీ, ఆసిఫ్‌నగర్

మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయం


ప్లకార్డును ప్రదర్శిస్తున్న ప్యారసాని వెంకటేష్


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసన్న


టోలిచౌకీలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చార్మినార్: ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు కైవశం చేసుకోవటంతో ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ కొడతారని బీజేపీ ఓబీసీ మోర్చా ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్యారసాని వెంకటేశ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మోదీ బహిరంగ సభకు హాజరైన సందర్భంగా ఎల్బీ స్టేడియంలో 'నేను మోదీ కుటుంబ సభ్యుడినే' అంటూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించి ముచ్చటగా మూడోసారి ప్రధాని మోదీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ విజయంలో హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి విజయం కూడా ఉండాలన్నారు. ప్రతి ఎన్నికల్లో విజయం సాధిస్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థికి ఈసారి షాక్‌ను ఇవ్వాలన్నారు. దశాబ్దాలుగా పాతబస్తీలో అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీ అభివృద్ధిని పూర్తిగా మరిచిపోయిందన్నారు. అందుకే హైదరాబాద్ నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఓడించడానికి అన్ని వర్గాల ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు.

మజ్లిస్ మాయమాటలు నమ్మకండి..

అబిడ్స్: మజ్లిస్ పార్టీ మాయమాటలు ప్రజలు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసన్న పేర్కొన్నారు. 40 ఏళ్లుగా ప్రజలను మోసం చేస్తూ విజయం సాధిస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆమె పర్యటించి బీజేపీని గెలిపించాలని ముమ్మర ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. విద్యావంతులైన డైనమిక్ నాయకురాలు మాధవీలతను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముస్లింలు హిందువులను మజ్లిస్ పార్టీ మోసం చేసిందే తప్పా ఏ రోజు కూడా అభివృద్ధి చేయలేదన్నారు. మతం పేరు చెప్పి మజ్లిస్ ఓట్లు దండుకుంటున్నారని ఆమె పిలుపునిచ్చారు. బీజేపీ విజయం సాధిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని ప్రసన్న పేర్కొన్నారు.

మాధవీలతను భారీ మెజార్టీతో గెలిపించాలి..

లంగర్‌హౌస్: హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను భారీ మెజార్టీతో గెలిపించాలని టోలిచౌకి డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి కోరారు. శుక్రవారం డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో సాయిబాబా చారి, సురేష్ చారి ఉన్నారు.

నాకే ఓటెయ్యమ్మా..


నాకే ఓటెయ్యమ్మా అంటూ హైదరాబాద్ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ప్రచారం చేశారు. గోషామహల్ నియోజకవర్గంలోని ఆగాపురాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లకు మజ్లిస్‌కే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ఆధ్వర్యంలోని హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మౌలిక వసతుల రూపకల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఒవైసీ పేర్కొన్నారు. – అబిడ్స్

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్‌ఓ అనుదీప్ దురిశెట్టి

బహదూర్‌పురా: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నవాబ్‌సాబ్ కుంట, బహదూర్‌పురా పోలింగ్ బూత్‌ను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పురా తహసీల్దార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, జీహెచ్ఎంసీ డీఈ, శానిటేషన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రియాంక కళాశాల విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రియాంక కళాశాల ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఆధ్వర్యంలో మురాద్‌నగర్, ఆసిఫ్‌నగర్, విజయనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా వారి జీవితాలను ప్రభావితం చేసే ముఖ్యమైన నిర్ణయం తీసుకునేలా వ్యక్తులకు అధికారం కల్పించడం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి


తలాబ్‌కట్టాలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి భారీ మెజార్టీతో గెలిపించాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కోరారు. శుక్రవారం సాయంత్రం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీబీ బజార్ చౌరస్తా, మొఘల్‌పురా, మొఘల్‌పురా ఓల్గా హోటల్, తలాబ్ కట్టా, అమన్‌నగర్–బీ, భవానీనగర్, సుల్తాన్‌షాహిజూలా, కవేలీకమాన్, మీర్ కా దయారా తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. తలాబ్ చంచలం, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

'మేనిఫెస్టోల పేరుతో మజ్లిస్ కపట మాటలు చెప్పదు'


హకీంపేట సభలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మేనిఫెస్టోల పేరుతో కపటమాటలు చెప్పి మజ్లిస్ ఎప్పుడు ప్రజలను మోసం చేయదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం నానల్‌నగర్ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే మజ్లిస్ పార్టీ మేనిఫెస్టో అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఈసారి కూడా అసదుద్దీన్ ఒవైసీని ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇతర పార్టీలలాగా తాము మేనిఫెస్టోలు అని కపట మాటలు చెప్పి ప్రజలను మోసం చేసే పార్టీ మజ్లిస్ పార్టీ కాదన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి ఎంపీ నిధుల నుంచి అసదుద్దీన్ ఎన్నో అభివృద్ధి పనులు చేయించారన్నారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అజీజ్ ఖాన్ పఠాన్, అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లంతా బీఆర్ఎస్ వైపే: శ్రీనివాస్ యాదవ్


బైక్ ర్యాలీలో అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఓటర్లు తమ వైపే మొగ్గు చూపుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బైక్ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఆరు గ్యారంటీలు ఫెయిల్ అయ్యాయన్నారు. ఎన్నికల ప్రచారంలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డోర్‌బస్తీలో..


ప్రచారం చేస్తున్న బాబు, మోహన్ తదితరులు

జియాగూడ: జియాగూడ నుంచి బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం అత్యధిక ఓటు బ్యాంకును అందిస్తామని డివిజన్ అధ్యక్షుడు సి.బాబు, సీనియర్ నాయకుడు జడల మోహన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడలోని 2బీ హెచ్‌కే కాలనీ, డోర్‌బస్తీ, సంజయ్ నగర్, బంగి బస్తీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

భీమ్‌నగర్‌లో..


ఇంటింటా ప్రచారం చేస్తున్న నరహరిచారి

బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ గెలుపు కోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నామని జియాగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి అన్నారు. శుక్రవారం జియాగూడలోని భీమ్‌నగర్, ఇక్బాల్‌గంజ్, బడాబండ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ సాగర్, హేమంత్, ప్రకాష్, అనిత, సుకన్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపవాసాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు


ఉపవాస దీక్షలు విరమిస్తున్న జైనులు

గోల్కొండ: ఉపవాసాలు చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని జైన గురువు డాక్టర్ సంకిత్ అన్నారు. కార్వాన్‌లోని దాదావాడి జైన మందిరంలో శుక్రవారం అక్షయ తృతీయ పర్వ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సరం రోజులుగా ప్రత్యామ్నాయ దినాల్లో మాత్రమే భోజనం చేస్తున్న 108 మంది జైన వృద్ధులు, యువతులకు చెరుకు రసం తాగించి ఉపవాస దీక్షలు విరమింపజేశారు.

రథాలపై ఊరేగింపు....

హైదరాబాద్‌కు చెందిన శ్రీవర్ధమాన్ స్థానక్వాసి జైన శ్రీవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యామ్నాయ రోజుల్లో ఆహారం, ఉపావాస దీక్షల విరమణ, అక్షయ తృతీయ పర్వ మహోత్సవం కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి జైనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విమ్లా భాయ్ కొచర్, కాంతా భాయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ మాదిగల ఉపకులాల జేఏసీ ప్రతినిధులు రేణిగుంట్ల ఎల్లయ్య మాదిగ, మాదిగ ఉపకులాల జాతీయ అధ్యక్షుడు బైరీ వెంకటేష్ ఎం.బుడగ జంగాల జేఏసీ చైర్మన్ తుర్పాటి హనుమంతు, గడిపే నాగయ్య మాదిగ, పాకాల రాజ్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో మాదిగలకు టికెట్లు కేటాయించలేదని వాపోయారు. మాదిగలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్‌లు వివిధ నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు ప్రాధాన్యత కల్పించాలని లేని పక్షంలో మాదిగల సత్తా చూపుతామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం


పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య

చార్మినార్: చందనోత్సవ సహిత శ్రీ లక్ష్మీ నర్సింహ హోమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ పూజల్లో మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడురు మండలం కంకటావ గ్రామంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి చందనోత్సవం, దీపోత్సవం, హోమం తదితర పూజా కార్యక్రమాల్లో గాజుల అంజయ్య ముఖ్యఅతిథిగా హాజరుకావడంతో ఉత్సవాల నిర్వాహకులు వరప్రసాద్ వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గాజుల అంజయ్య మాట్లాడుతూ..ప్రతి ఏడాది ఇక్కడ చందనోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కాట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం


ప్రచారం చేస్తున్న మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ

చార్మినార్: అన్ని వర్గాల అభివృద్ధే మా పార్టీ ధ్యేయమని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ అన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. తమ పార్టీ సెక్యులర్ పార్టీ అన్నారు. కులమతాలకు అతీతంగా తమ పార్టీ పని చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తాము కృషి చేస్తున్నామన్నారు. కులాలు,మతాల పేరుతో ఓట్లడిగే అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో స్థానిక ఓటర్లు బుద్ధి చెప్పనున్నారన్నారు.

ఘనంగా పరశురామ్ జయంతి


పూజలు చేస్తున్న పరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షుడు నవరతన్ ఇందోరియ

జియాగూడ: కార్వాన్‌లోని గణేష్ ఘాట్ వద్ద గల పరశురామ్ మందిరంలో ఆయన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షుడు నవరతన్ ఇందోరియ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాట్ సమాజ్ అధ్యక్షుడు ధర్మారం డాకా, ఆలయ నిర్వాహకులు కమల్ కిశోర్ మహారాజ్, బీజేపీ నాయకుడు బాలాజీ హివారే, గిరీష్ జోషి, ప్రవీణ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


అభ్యర్థితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేఎస్.ఆనంద్ రావు తదితరులు


దానంను గెలిపించాలని ప్రచారం చేస్తున్న చైర్మన్ మెట్టు సాయికుమార్, హనుమంతరావు


రెడ్‌హిల్స్‌లో ప్రచారం చేస్తున్న పాశం రాజేందర్ యాదవ్ తదితరులు


మాట్లాడుతున్న తులసి శ్రీనివాస్ తదితరులు

చార్మినార్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే పాతబస్తీ అభివృద్ధి కోసం వేల కోట్ల నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తారని టీపీసీసీ కార్యదర్శి కేఎస్ ఆనంద్‌రావు అన్నారు. పాతబస్తీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అభ్యర్థితో పాటు చార్మినార్ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈసారి దేశ వ్యాప్తంగా తమ పార్టీ అభ్యర్థులు ఆశించిన మెజార్టీ సాధిస్తుండడంతో దేశ ప్రధానిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపడతారన్నారు. హైదరాబాద్ నుంచి పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులు మజ్లిస్ పార్టీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని సహకరిస్తున్నారన్నారు.

దానం గెలుపుతోనే లష్కర్ సుందరవనం..

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపిస్తే సికింద్రాబాద్ నియోజకవర్గం సుందరవనంగా మారుతుందని రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, సీనియర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వీహెచ్. హన్మంతరావు అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించి దానం నాగేందర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మెట్టు సాయి కుమార్, హన్మంతరావు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి ఏ ఒక్కరోజు కూడా సికింద్రాబాద్‌లో పర్యటించలేదన్నారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసిన కిషన్‌రెడ్డిని ఓడించాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు.

దానం గెలుపు కోసం ఇంటింటా ప్రచారం..

నాంపల్లి: సికింద్రాబాద్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా శుక్రవారం నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌లో కాంగ్రెస్ నేతలు పాశం రాజేందర్ యాదవ్, పరమేష్ తాండేకర్, పీఎం మురళీకృష్ణ, జగదీశ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కర పత్రాలను పంచి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. సికింద్రాబాద్ మరింత అభివృద్ధి జరగాలంటే దానం నాగేందర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బ్రాహ్మణ సంఘం జేఏసీ మద్దతు...


సుల్తాన్‌బజార్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతామని తెలంగాణ బ్రాహ్మణ సంఘం జేఏసీ ప్రకటించింది. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జేఏసీ చైర్మన్ తులసి శ్రీనివాస్, శ్రీవైష్ణవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్టీ చారి, సలహాదారు రత్నమాచారి, వారాణాసి వంశీ, సత్యనారాయణమూర్తి మాట్లాడారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



గౌలిపురా: భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి లా అండ్ ఆర్డర్, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. తలాబ్ కట్టా, భవానీనగర్, చాచా గ్యారేజీ, నషేమాన్ నగర్, అమన్‌నగర్–ఏ, బీ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానమే



చార్మినార్: సమాజంలో కుల వ్యవస్థతో పాటు వర్ణ విభేదాలు, లింగ వివక్షను వ్యతిరేకించి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సమానమని నినదించిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరుడని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి కొనియాడారు. మహాత్మా బసవేశ్వరుని జయంత్యుత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం టాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సర్వమానవ సౌభ్రాతుత్వం కోసం పని చేసిన మహాత్ముడు బసవేశ్వరుడని ఆయన అన్నారు.

సన్మానం



అబిడ్స్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. నగరానికి వచ్చిన ఆయనకు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 15 ఎంపీ సీట్లు రావడం ఖయమన్నారు.



అబిడ్స్: రాహుల్‌గాంధీని రాష్ట్ర పీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు పోల్కం శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. నగరానికి వచ్చి రాహుల్ గాంధీని ఆయన సత్కరించి గదను బహూకరించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..తెలంగాణతో పాటు దేశం నలుమూలల కాంగ్రెస్ గాలులు వీస్తున్నాయన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684